క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా గరుడసేవ



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై వేంజేంపచేశారు. అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. సేవలో పాల్గొన్న భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలబోగం నిర్వహించారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

చిరు వ్యాపారిపై కానిస్టేబుల్ జులుం

- పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

పెందుర్తి: అనకాపల్లి జిల్లాలో పని చేస్తున్న ఓ కానిస్టేబుల్ పెందుర్తి ప్రాంతంలోని ఓ చిరు వ్యాపారిపై జులం ప్రదర్శించడంతో బాధితుడు పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కృష్ణరాయపురం కూడలి వద్ద మహేష్ అనే వ్యక్తి టిఫిన్ దుకాణం నడుపుకుంటున్నాడు. శుక్రవారం రాత్రి స్థానికంగా నివాసం ఉంటున్న గణేష్ అనే వ్యక్తి మహేష్ దుకాణం వద్దకు టిఫిన్ కోసం వచ్చాడు. ఈ క్రమంలో మహేష్‌తో గణేష్ గొడవపడ్డాడు. స్థానికులు కలగజేసుకుని అప్పటికీ గొడవ సద్దుమణిగేలా చేశారు. అయితే గణేష్‌కు పరిచయం ఉన్న అనకాపల్లి జిల్లాలో పనిచేస్తున్న కానిస్టేబుల్ ఆనంద్ ప్రసాద్‌కు విషయం చెప్పాడు. దీంతో కానిస్టేబుల్ ఆనంద్ ప్రసాద్ శనివారం ఉదయం మహేష్ దుకాణం వద్దకు వచ్చి 'నేను పెందుర్తి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్‌ని..మా స్నేహితుడితోనే గొడవ పడతావా..నీ సంగతి తేలుస్తా' అంటూ మహేష్‌ను కొట్టాడు. దీంతో బాధితుడు పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ సతీష్‌కుమార్ విచారణ చేస్తున్నారు.

సముద్ర తీరంలో వ్యర్థాల తొలగింపు



తిక్కవానిపాలెం తీరంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

పరవాడ: తిక్కవానిపాలెం సముద్ర తీరంలో శనివారం అధికారులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తీరంలో పేరుకుపోయిన చెత్తా చెదారాలను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. ఈ స్వచ్ఛ హీ సేవా కార్యక్రమంలో పరవాడ ఎంపీడీవో శ్యామ్‌సుందర్, పరవాడ పంచాయతీ విస్తరణాధికారి కె.ధర్మారావు, వాడ చీపురుపల్లి గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సహకరించండి



అవగాహన కలిగిస్తున్న ఎస్‌ఐ సూరిబాబు

పెందుర్తి: పండగల సీజన్ కాబట్టి మహిళలు తమ మెడలోని ఆభరణాల పట్ల అప్రమత్తంగా ఉండాలని క్రైం విభాగం ఎస్‌ఐ సూరిబాబు సూచించారు. శనివారం జీవీఎంసీ 88వ వార్డు గవరజగ్గయ్యపాలెంలో నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ చైన్ స్నాచింగ్, ఇంటి దొంగతనాలు, ఇతర నేరాల నియంత్రణకు ప్రజల భాగస్వామ్యం అవసరం అని అన్నారు. ప్రజలకు పలు సూచనలు సలహాలు అందించారు.

ప్రభుత్వ కార్యాలయాలకు.. ఇదేం దుస్థితి?

పరవాడ మండలంలో ఉన్న పలు ప్రభుత్వ కార్యాలయాలు తుప్పలు, డొంకల మధ్యే నిర్వహిస్తున్నారు. ఏపుగా పెరిగిన తుప్పలతో అసలు ఆ కార్యాలయాలు అక్కడ ఉన్నాయో లేదో కూడా ప్రజలకు తెలియని పరిస్థితి. పశువుల ఆస్పత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వంటివి ఈ విధంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని అటు సిబ్బంది, ఇటు ప్రజలు కోరుతున్నారు.

- తుప్పల మధ్యే నిర్వహణ
- అవస్థలు పడుతున్న సిబ్బంది, ప్రజలు
- పాములు, జెర్రెలు, తేళ్లతో భయం భయం



అపరిశుభ్రంగా వాడచీపురుపల్లి పశు వైద్య కేంద్రం

పరవాడ: మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, పశువుల ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తుప్పలు, డొంకలకు నిలయాలుగా మారిపోయాయి. మండల కేంద్రమైన పరవాడలో ఏర్పాటు చేసిన పశు వైద్య కేంద్రం చుట్టూ దట్టంగా తుప్పలు పెరిగిపోవడంతో అసలు పశువైద్య కేంద్రం ఉందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. రోగాల బారిన పడిన పశువులు, కుక్కలు, కోళ్లను చికిత్స కోసం తీసుకువచ్చే మండల ప్రజలు పశువుల ఆస్పత్రికి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఆస్పత్రికి రహదారి సౌకర్యం కూడా అంతంత మాత్రమే. ఆస్పత్రి చుట్టూ పెరిగిన తుప్పలతో విష జంతువులు లోపలికి ప్రవేశించి భయభ్రాంతులను చేస్తున్నాయని ఆస్పత్రి సిబ్బంది వాపోతున్నారు. వాడచీపురుపల్లిలో ఏర్పాటు చేసిన పశువైద్య కేంద్రం చుట్టూ వివిధ రకాల తుప్పలు పుట్టుకొచ్చి అపరిశుభ్రంగా తయారైంది. ఏ మాత్రం వర్షం వచ్చినా ఆస్పత్రి లోపల ప్రదేశం బురదమయంగా మారుతుంది. పరవాడలో రైతాంగం కోసం ఏర్పాటు చేసిన వ్యవసాయ కార్యాలయం ఎదుట పెంచిన మొక్కలను తీర్చిదిద్దడానికి అధికారులు కనీస చర్యలు చేపట్టలేదు. అలాగే పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట దట్టంగా పెరిగిన వివిధ రకాల తుప్పలు, డొంకలు రోగులను భయపెడుతున్నాయి. దట్టంగా పెరిగిన తుప్పల కారణంగా ఆస్పత్రిలోకి పాములు, తేళ్లు ప్రవేశించి భయభ్రాంతులను చేస్తున్నాయని రోగులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విషయానికొస్తే ఆస్పత్రి ముందు ఏర్పాటు చేసిన గార్డెన్ ఆలనాపాలన చూసే నాథుడు లేక అపరిశుభ్రంగా తయారైంది. ఆస్పత్రి వెనుక వైపు మరింత దారుణంగా ఉంది. ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు, వివిధ రకాల తుప్పలు, డొంకలతో నిండిపోయింది. రాత్రి సమయంలో తుప్పల మధ్య నుంచి విష జంతువులు ఆస్పత్రిలోకి ప్రవేశించి రాత్రి వేళ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని భయపెడుతున్నాయి. విష జంతువుల మధ్య విధులు నిర్వర్తించడం కష్టంగా ఉందని సిబ్బంది వాపోతున్నారు.



తుప్పల మాటున పరవాడ వ్యవసాయ కార్యాలయం



తుప్పల మధ్య పరవాడ పశు వైద్య కేంద్రం



పరవాడ పీహెచ్‌సీ వద్ద దట్టంగా పెరిగిన తుప్పలు

విష జంతువులతో భయం భయం..



వాడచీపురుపల్లి పీహెచ్‌సీలో వెనుక వైపు దట్టంగా పెరిగిన తుప్పలు, చెట్లతో విష జంతువుల సమస్య అధికంగా ఉంది. వాటి బెడదతో పీహెచ్‌సీలో రాత్రి సమయంలో విధులు నిర్వహించడం భయంగా ఉంది. చీకటి పడితే చాలు పాములు, తేళ్లు ఆస్పత్రిలోకి చొరబడుతున్నాయి. ఆస్పత్రి వెనుక వైపు దట్టంగా పెరిగిన తుప్పలను తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పొన్నగంటి మహాలక్ష్మి, కంటింజెంటు వర్కర్, వాడచీపురుపల్లి

తుప్పలు తొలగించాలి



రోగాలు సోకిన పశువులను ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే భయపడుతున్నాం. ఆస్పత్రి ముందు దట్టంగా పెరిగిన తుప్పల వల్ల ఆస్పత్రి బయటికి కనిపించడం లేదు. ఆస్పత్రికి వెళ్లడానికి రహదారి సౌకర్యం బాగా లేదు. ఆస్పత్రి ఎదుట ఏపుగా పెరిగిన తుప్పలు, డొంకలను వెంటనే తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వసంతుడు, రైతు, కలపాక

తుప్పల తొలగింపునకు చర్యలు



వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏపుగా పెరిగిన తుప్పలను గ్రామ పంచాయతీ సహకారంతో తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. గార్డెన్‌ను తీర్చిదిద్దడానికి కృషి చేస్తాం. ఆస్పత్రిలోకి విష జంతువులు ప్రవేశించడం వాస్తవమే. త్వరలో సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కనకప్పారావు, ప్రభుత్వ వైద్యాధికారి, వాడచీపురుపల్లి

మత్స్యకార్మికులకు ఉపాధి కల్పించాలి

పరవాడ: ఫార్మాసిటీ, ఎన్టీపీసీ పరిశ్రమల వ్యర్థ రసాయనాల ద్వారా తీవ్రంగా నష్టపోయిన ముత్యాలమ్మపాలెం మత్స్య కార్మికులకు ఆయా పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలని బీజేవైఎం కార్యదర్శి మోసా రామకృష్ణ కోరారు. ముత్యాలమ్మపాలెంలో సీసీ రోడ్డు శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. పరిశ్రమల వలన నష్టపోయిన మత్స్యకార్మికులకు ఆయా పరిశ్రమల్లో ఉపాధి కల్పిస్తామని ఇచ్చిన హామీ నేటికీ అమలు చేయలేదన్నారు. సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



వెంకటపతిపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. మండలంలో ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, తిక్కవానిపాలెం, రావాడ, తిక్కవానిపాలెం, ఈ.బోనంగి గ్రామాల్లో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే పంచకర్ల శనివారం భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీసీ రోడ్లను త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధిలో ముందంజలో ఉన్న పంచాయతీలకు మలివిడతగా మరిన్ని నిధులను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పైలా జగన్నాథరావు, మాజీ ఎంపీపీ ఎం.అప్పలనాయుడు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం పట్టని కూటమి ప్రభుత్వం



నిత్యవసరాల ధరల పెరుగుదలపై వేపగుంట కూడలి వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నేతలు, ప్రజలు

- నిత్యావసరాల ధరలకు రెక్కలు
- మోసపూరిత హామీలతో గద్దెనెక్కి దోచుకుతింటున్నారు
- వేపగుంటలో సీపీఐ ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ

పెందుర్తి: వసూళ్లు..దోపిడీలు తప్ప కూటమి ప్రభుత్వానికి ప్రజా సంక్షేమం పట్టడం లేదని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ విమర్శించారు. ఎన్నికల సమయంలో నిత్యవసరాల ధరలు పెరగకుండా ప్రజలకు అండగా ఉంటామని గద్దెనెక్కిన టీడీపీ–జనసేన–బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రజల నడ్డి విరుస్తోందని.. సీఎం చంద్రబాబు పాలనలో సామాన్యులు కడుపు నిండా తినే పరిస్థితి కూడా లేదన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న కూరగాయలు, నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో శనివారం వేపగుంట కూడలి వద్ద నిరసన వ్యక్తం చేశారు. నిత్యావసరాల ధరల పెరుగుదలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఓ వైపు తగిన విధివిదానాలు లేని ఇసుక పాలసీ కారణంగా లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేకుండా ఉన్న సమయంలో ఇలా నిత్యవసరాల వస్తువుల ధరలు పెరగడం విచారకరం అన్నారు. విజనరీగా చెప్పుకునే సీఎం చంద్రబాబుకు మోసం తప్ప ప్రజల బాగోగులు పట్టవని ధ్వజమెత్తారు. నిత్యవసరాల ధరలు పెరిగి రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే సీఎం చంద్రబాబ, డీసీఎం పవన్‌కల్యాణ్ కులాలు, మతాలు, దీక్షలు అంటూ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిత్యవసరాల ధరలను అదుపులోకి తెచ్చేందుకు తగిన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలతో కలిసి తీవ్రస్థాయిలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వై.రాంబాబు, రమణ, అనురాధ, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ సరకులు సక్రమంగా అందించాలి



ఎంవీపీ రైతుబజార్‌లో వినియోగదారులతో మాట్లాడుతున్న జేడీ సుధాకర్

ఆరిలోవ: రైతుబజార్లలో సబ్సిడీపై ఇస్తున్న టమోటా, ఉల్లిపాయలను వినియోగదారులకు సక్రమంగా అందించాలని అధికారులకు మార్కెటింగ్ శాఖ విశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు(జేడీ) సుధాకర్ సూచించారు. ఎంవీపీ రైతుబజార్‌ను శనివారం ఆయన సందర్శించారు. సబ్సిడీపై అందిస్తున్న టమోటా, ఉల్లిపాయల కౌంటర్లను సందర్శించి వాటి నాణ్యతను పరిశీలించారు. రోజుకు ఎన్ని టన్నులు విక్రయం జరుగుతున్నాయో రైతుబజార్ ఈవో జి.ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. కూరగాయల స్టాళ్ల వద్ద వినియోగదారుతో జేడీ మాట్లాడారు. బోర్డులపై ప్రకటించిన ధరలకు రైతులు, వ్యాపారులు సరకులు విక్రయిస్తున్నారా, ధరల్లో తేడాలు చెబుతున్నారా అంటూ ఆరా తీశారు. టమోటా, ఉల్లిపై ఇస్తున్న సబ్సిడీని వినియోగదారుల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన సరకులు అందుబాటులో లేకపోతే ఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు. కర్నూలు ఉల్లి రూ.37కి సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖాధికారి ఎస్.కె.యాసిన్, ఇంజినీర్ కెనడీ పాల్గొన్నారు.

రైతు బజార్‌లో తనిఖీలు

కూరగాయలు, వస్తువుల విక్రయాలపై ఆరా



స్టాల్‌ను పరిశీలిస్తున్న మార్కెటింగ్ అధికారి యాసిన్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డులోని మర్రిపాలెం రైతు బజార్‌ను శనివారం జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ అధికారి యాసిన్ తనిఖీ చేశారు. రైతుబజార్ లో ఉన్న టమాటా, ఉల్లిపాయలతో పాటు ప్రభుత్వ సరఫరా చేస్తున్న కర్నూలు ఉల్లిపాయల స్టాల్స్‌ను పరిశీలించారు. సబ్సిడీ పై క్యూ ఆర్ కోడ్‌ను ఉపయోగించి అమ్ముతున్న ఆయిల్ కౌంటర్‌ను సందర్శించి కొనుగోలు చేయడానికి వచ్చిన వినియోగదారులు వివరాలు పరిశీలించారు. రైస్ కార్డు తీసుకొచ్చిన వారి వివరాలు, కార్డు నంబర్ నమోదు చేసి మాత్రమే నూనె ఇవ్వా లని సూచించారు. టమాటా, ఉల్లిపాయలు నాణ్యంగా ఉన్నవి మాత్రమే వినియోగదారులకు అందించాలన్నారు. ఈ సందర్భంగా రైతు బజార్‌లో దుకాణాలు నిర్వహిస్తున్న రైతుల గుర్తింపు కార్డులను పరిశీలించారు. వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతు బజార్ ఈవో కొమ్మనాపల్లి వరహాలు, సహాయకుడు ప్రతాప్ పాల్గొన్నారు.

నేడు యాదవ సంఘం సమావేశం

మల్కాపురం: జిల్లా యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20న శివాజీపాలెం సవేరా ఫంక్షన్ హాల్‌లో జరగనున్న సమావేశానికి పారిశ్రామిక ప్రాంత యాదవ సంఘాల ప్రతినిధులు, సభ్యులు హాజరు కావా లని సంఘ ప్రతినిధి పుర్రె సురేష్‌యాదవ్ పిలుపునిచ్చారు. 59వ వార్డు శాంతిగిరి కాలనీలోని తన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. వచ్చే నెల 15న రాధాకృష్ణ మహోత్సవాలు జరగనున్నాయని, వీటి నిర్వహణ తదితర అంశాలపై ఆదివారం జరిగే సమావేశంలో చర్చిస్తారన్నారు. ఉద యం 10 నుంచి మధ్యాహ్నం 12 గంట ల వరకు సమావేశం జరుగుతుందని, యాదవులంతా తరలిరావాలని కోరారు.

గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించిన అధికారులు



చెరువు గండిని పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

పరవాడ: పి.బోనంగి గ్రామంలో కన్నయ్య చెరువుకు పడిన గండిని ఇరిగేషన్‌శాఖ అధికారులు శనివారం పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుకు గండి పడడంతో పోర్టుకో కాలనీలో నివసిస్తున్న ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని సర్పంచ్ బండారు కల్పన, ఉప సర్పంచ్ గొంతిన రాము అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. గండి పడిన ప్రదేశాన్ని శనివారం ఇరిగేషన్ శాఖ అధికారులు సాయికిరణ్, సత్యనారాయణ, రాజు పరిశీలించారు. గండి పూడ్చివేతకు ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. అధికారుల వెంట నాయకులు బి. రాజశేఖర్, బోకం సత్తిబాబు ఉన్నారు.

డ్రాయింగ్ పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

విశాఖ విద్య: ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో శ్రీకృష్ణాపురం సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు ప్రతిభ చూపారు. అనకాపల్లి జిల్లా కొక్కిరాపల్లిలో జరిగిన పోటీల్లో పాల్గొన్న గురుకుల విద్యార్థులు కె.బాలు(9వ తరగతి), ఎల్.కార్తీక్(ఇంటర్ ఫస్టియర్) డ్రాయింగ్ విభాగంలో ఉమ్మడిగా ప్రథమ బహుమతి సాధించారు. ఈ విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన ఆర్ట్ టీచర్ పి.సుధాకర్‌ను, వారిని ప్రోత్సహిస్తున్న గురుకుల ప్రిన్సిపాల్ రత్నవల్లిని గురుకులాల ఉమ్మడి జిల్లా కన్వీనర్ రూపవతి అభినందించారు. విద్యార్థులకు అవార్డు అందజేసి, భవిష్యత్‌లో మరిన్ని బహుమతులు అందుకోవాలని ఆకాంక్షించారు.

పౌష్టికాహారంపై అవగాహన

విశాఖ విద్య: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని గౌరీనగర్ అంగన్‌వాడీ కార్యకర్త జె.మార్త, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి శ్యామల సూచించారు. గౌరీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం టీహెచ్‌ఆర్ పంపిణీ చేశారు. కేంద్రం పరిధిలోని గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆహార పద్ధతులు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఆశ కార్యకర్త లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాయి మందిరం అభివృద్ధికి సహకరించండి



కార్పొరేటర్ రమణను సత్కరిస్తున్న ధ్యాన మందిర కమిటీ పెద్దలు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్‌ఈబీ కాలనీలోని శ్రీ షిర్డీసాయి ధ్యాన మందిరం అభివృద్ధికి సహకరించాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు విళ్లా సత్యనారాయణరావు కోరారు. ఈ మేరకు శనివారం నూతన కమిటీ సభ్యులంతా కార్పొరేటర్ బొమ్మిడి రమణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను సత్కరించి, బాబా ప్రసాదం అందజేశారు. జీవీఎంసీ ద్వారా మందిరాన్ని అభివృద్ధి చేసేలా చూడాలని కార్పొరేటర్‌ను వారు కోరారు. తన వంతు సహకారం అందిస్తానని ఈ సందర్భంగా రమణ తెలిపారు.

విద్యుత్ భారంపై సీపీఎం ఆందోళన



సబ్బవరం ఏపీఈపీడీసీఎల్ సెక్షన్–1 కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకురాలు ప్రభావతి తదితరులు

సబ్బవరం: ప్రజలపై ట్రూ అఫ్ చార్జీలు రద్దు చేయాలని, విద్యుత్ శ్లాబ్ చార్జీల భారాన్ని తగ్గించాలని సబ్బవరం విద్యుత్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం ఇచ్చిన పిలుపు మేరకు ధర్నా నిర్వహించినట్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.ప్రభావతి తెలిపారు. 2023–24 సంవత్సరాల నుంచి ట్రూ అఫ్ చార్జీల పేరుతో యూనిట్‌కు రూ.3 నుంచి రూ.4 వరకూ వసూలు చేస్తూ రూ.8,200 కోట్లు రాష్ట్ర ప్రజలపై కూటమి ప్రభుత్వం భారం మోపేందుకు రంగం సిద్ధం చేస్తోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఈవిధానానికి స్వస్తి చెప్పకపోతే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఓ వైపు నిత్యావసర వస్తువుల ధరల ఆకాశాన్నంటుతున్నాయని, మరో వైపు ఇసుక భారంతో పనులు లేక కార్మికులు రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో మండల సీపీఎం నాయుకురాలు ఉప్పాడ సత్యవతి, ఎం. గౌరేషు, వై. సోంబాబు, పి.కోటి, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఎందుకిలా వదిలేశారు..!

- స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ దుస్థితిపై జీవీఎంసీ కమిషనర్ మండిపాటు
- మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని ఆదేశం



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

ఆరిలోవ: ముడసర్లోవ జంక్షన్ వద్ద హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో కొన్నేళ్ల పాటు నిర్వహించి ఖాళీ చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను శనివారం జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ సందర్శించారు. ఈ కేంద్రం లోపల అన్ని గదులు, పరిసరాలు చెత్త, ధూళితో నిండిపోవడాన్ని ఆయన గమనించారు. గోడలు శిథిలం కావడం, రంగులు వదిలేయడం, స్కిల్ డెవలప్‌మెంట్ నిర్వాహకులు విడిచిపెట్టిన చెత్త, విరిగిన పైపులుతో అస్తవ్యస్తంగా మారింది. దీంతో జీవీఎంసీ అధికారులపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని హెచ్‌పీసీఎల్ యాజమాన్యం ఖాళీ చేసి సుమారు ఏడాది కావస్తున్నా.. ఇంత నిర్లక్ష్యంగా ఎలా వదిలేస్తారంటూ మండిపడ్డారు. ఈ భవనం పూర్తిగా మరమ్మతులకు గురైందన్నారు. ఈ భవనాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంగా వినియోగించుకున్న హెచ్‌పీసీఎల్ అధికారులదే దీని బాధ్యతని తెలిపారు. వారు జీవీఎంసీకి సక్రమంగా అప్పగించ లేదని, హెచ్‌పీసీఎల్ యాజమాన్యానికి దీనిపై వెంటనే లేఖ పంపించాలని జోన్–2 కమిషనర్ సింహాచలంను ఆయన ఆదేశించారు. ఈ భవనంలోని అన్ని విభాగాల్లో వ్యర్థాలను తొలగించి, మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాలని పర్యవేక్షక ఇంజినీర్ శాంసన్ రాజుకు కమిషనర్ సంపత్‌కుమార్ సూచించారు. భవనం విస్తీర్ణం, దీనికి సంబంధించిన ఖాళీ స్థలం సర్వే చేయించి నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న ఈ భవనంలో రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా సెక్యూరిటీని నియమించాలని సూచించారు. పలువురు జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

అసకపల్లిలో రెవెన్యూ సదస్సు



తహసీల్దార్ చిన్నికృష్ణకు అర్జీలను అందజేస్తున్న సర్పంచ్ కర్రి నరసింగరరావు తదితరులు

సబ్బవరం: రైతులు తమ దృష్టికి తీసుకొచ్చే ప్రతి రెవెన్యూ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ చిన్ని కృష్ణ పేర్కొన్నారు. మండంలోని అసకపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. అసకపల్లి రెవెన్యూ పరిధిలోని 209 సర్వే నంబర్లలో 550.76 ఎకరాల జిరాయితీ భూములు, 565.46 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు తెలిపారు. ఆయా భూములకు సంబంధించి గతంలో చేసిన రీ సర్వేలో 2,900 ఎల్‌పీఎంలు ఇచ్చినట్లు తెలియజేసారు. గతంలో జరిగిన రీ సర్వేలో విస్తీర్ణాలలో తేడాలు ఉంటే సరిచేసుకోవచ్చాన్నారు. సదస్సులో సర్పంచ్ కర్రి నరసింగరరావు, ఎంపీటీసీ కర్రి అప్పారావుతో పాటు పలువురు నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.